క్లుప్తంగా

తీరుగూడెంలో వైఎస్సార్ సీపీ ప్రచారం



తీరుగూడెం వాసులకు కరపత్రాలు అందిస్తున్న కౌన్సిలర్లు, పార్టీ నాయకులు

నిడదవోలు: సంక్షేమ పథకాల సారథి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు అన్నారు. పట్టణంలోని 18వ వార్డు తీరుగూడెంలో బుధవారం ఆ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి వారిద్దరూ ఇంటింటికీ వెళ్లి పట్టణంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. సంక్షేమం, అభివృద్ధితో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ బీసీ నాయకులు గంగుల గోపియాదవ్, కౌన్సిలర్లు సైదు చంద్రశేఖర్, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్‌కుమార్, పార్టీ నాయకులు గుర్రం జేమ్స్, తోలేటి కోటేశ్వరరావు, కైకరపు సత్యనారాయణ, సైదు సుబ్బారావు, అవిడి రాజు తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి లేకుండా చర్యలు

నిడదవోలు రూరల్: వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ సూచించారు. సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం వివిధ ప్రభుత్వ కార్యక్రమాలపై ఆమె సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ రోజూ నిర్ణీత సమయానికి తాగునీటికి విడుదల చేయాలని, నీటి వృథాను అరికట్టాలని సూచించారు. రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేయడంతో పాటు పైపులైన్ లీకేజీలను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఎన్నికల కోడ్ అమలుపై పలు సూచనలు చేశారు. సమావేశంలో ఈఓపీఆర్డీ మల్లిక, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'సురక్ష' శిబిరంలో 361 మందికి సేవలు

నిడదవోలు : పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ వార్డు సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష- 2 వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 361 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందుల కిట్లను పంపిణీ చేశారు. ఎన్టీఆర్ కాలనీ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ప్రసన్నకుమార్ నేతృత్వంలో వివిధ విభాగాల వైద్యులు రోగులకు సేవలు అందించారు. శిబిరంలో 35 మందికి కంటి పరీక్షలు చేశారు. మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు సేవలు అందించారు.

ఇన్సులిన్ సిరంజీల వితరణ

నల్లజర్ల: స్థానిక పీహెచ్‌సీకి నిత్యం కుక్కకాటు కేసులు అధికంగా వస్తున్నాయి. వారందరికీ ఇన్సులిన్ సిరంజీల ద్వారా వ్యాక్సిన్ అందించాలి. ఈ సిరంజీలను ప్రభుత్వం అందించడం లేదు. దాంతో కుక్కకాటు బాధితులు కాలినడకన వెళ్లి ఇన్సులిన్ సిరంజీలను కొని తెచ్చుకొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న లయన్స్ మాజీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు బుధవారం రూ.3 వేలు విలువైన సిరంజీలను నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టరు తెల్లం గంగాధరరావుకు అందజేశారు.

ఎన్నికల నియమావళి అమలు

తాళ్లపూడి: ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారుల బృందాలు మండలంలో క్రమం తప్పకుండా పర్యటిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన సి.విజిల్ యాప్ ద్వారా మండలంలో ఒక ఫిర్యాదు నమోదైందని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి గురవయ్య తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వ కార్యాలయానికి వైఎస్సార్ సీపీ జెండాను పోలిన రంగులున్నాయని ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు తుపాకులగూడెం గ్రామంలోని రైతుభరోసా కేంద్రం భవన రంగులను మార్చామన్నారు. పంచాయతీ పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



గోపాలపురంలో పూజలు అందుకున్న లలితాంబిక అమ్మవారు

గోపాలపురం: స్థానిక లలితాంబిక అమ్మవారి ఆలయ 15వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమ పూజలు, లలితా సహస్రనామార్చన, పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ నిర్మాత డాక్టర్ బొమ్మారెడ్డి గంగాధరరెడ్డి, రాణి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మాతాశిశువు భద్రంగా..

- ఆసుపత్రి నుంచి ఇంటికి చేరుస్తున్న తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్
- కొవ్వూరు డివిజన్‌లో అందుబాటులో నాలుగు వాహనాలు
- 102లో పూర్తి నదుపాయాలు



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్

నల్లజర్ల: మాతృత్వం అనేది మాటల్లో చెప్పలేని అనుభూతి. నవమాసాలు మోసి కన్న పసికందును చూడగానే ఆ తల్లి తాను పడ్డ పురుటి నొప్పులన్నింటినీ మరిచిపోయి ఆనందంతో పొంగిపోతుంది. ఒకింత గర్వంగా కూడా ఫీలవుతుంది. తల్లి కడుపులో నుంచి ఈ లోకంలో ప్రవేశించిన పురిటి బిడ్డను, బాలింతను ఆసుపత్రి నుంచి సురక్షితంగా ఇంటికి చేర్చే బాధ్యతను ప్రభుత్వం స్వీకరించింది. మాతృమూర్తి ఎలాంటి ప్రయాస పడనవసరం లేకుండా ప్రభుత్వమే అన్ని ఆసుపత్రుల్లోనూ ప్రసూతి సేవలను ఉచితంగా అందిస్తోంది.అనంతరం మాతాశిశువులను 102 వాహనాల్లో పైసా ఖర్చు లేకుండా ఇంటికి చేరవేస్తున్నారు. వేసవి నేపథ్యంలో ఎండవేడిమి తగలకుండా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ సౌకర్యం కూడా కల్పించారు. గతంలో ఏర్పాటు చేసిన వాహనాలు కనీస సౌకర్యాలు లేక చాలా ఇబ్బందులు పడేవారు. ఇపుడు పరిస్థితులు మారాయి. ప్రస్తుతం 102 సేవలు ఎంతో మెరుగ్గా ఉన్నాయంటున్నారు. 2022 ఏప్రిల్1న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లిలో తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. తూర్పుగోదావరి జిల్లాలో గత మూడు నెలల్లో 3,599 మంది తల్లీబిడ్డలను 102 వాహనాల్లో సిబ్బంది వారి గృహాలకు భద్రంగా చేర్చారు.

సమర్థవంతంగా సేవలు

రాష్ట్ర వ్యాప్తంగా అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో గత రెండేళ్లుగా తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ సేవలు అందిస్తున్నారు. జిల్లాలో ప్రధాన ఆసుపత్రుల వద్ద ఈ వాహనాలను అందుబాటులో ఉంచారు. ఆసుపత్రులలో ప్రసూతి సేవలు పొంది డిశ్చార్జి అయిన వారి వివరాలను తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ సిబ్బందికి అందిస్తారు. ఇందుకోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుంది. ఆసుపత్రి వద్ద నుంచి తల్లీబిడ్డలను ఈ వాహనంలో వారి ఇంటి వద్ద దించిన తర్వాత తల్లీబిడ్డ ఫొటోలను ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

ప్రభుత్వాదేశాలు పాటిస్తున్నా..



ఆసుపత్రులలో ప్రసవాలు జరిగాక, యాప్ ద్వారా ఆ వివరాలు మాకు చేరిన వెంటనే తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనంలో మాతాశిశువులను వారి స్వగ్రామాలకు చేరుస్తున్నాం. ప్రభుత్వాదేశాలను పూర్తిగా అమలు చేస్తూ ఈ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. తల్లీబిడ్డలు తమ స్వగ్రామానికి చేరిన తర్వాత వారి కుటుంబ సభ్యుల ఆనందం వర్ణనాతీతం. మేం కూడా సంతృప్తికరంగా విధులు నిర్వర్తిస్తున్నాం. కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల అవసరాల కోసం నాలుగు వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి నెలా ప్రసూతి కేసులతో పాటు ఐరన్ సుక్రోజ్ కోసం తల్లీబిడ్డలను ఆసుపత్రులకు తీసుకెళుతున్నాం.

– సురేష్, తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ డివిజన్ ఇన్‌చార్జ్

సేవలు బాగున్నాయి



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఎటువంటి ఇబ్బంది లేదు. చాలా సౌకర్యవంతంగా వాహనం ఉంది. ఎంతదూరమైనా ప్రయాణం సుఖవంతంగా ఉంది.బాలింతతో పాటు ఆశ కార్యకర్త కూడా కూర్చునేలా వాహనంలో సిట్టింగ్ ఉంది. లగేజీ పెట్టుకోవడానికి వెనుక తగినంత ఖాళీ స్థలం ఉంది. ఈ వాహనాలు ఏర్పాటు చేయడం ద్వారా బాలింతలకు ప్రయాణ ఇబ్బందులు తొలగాయి.

– పెదపూడి సుమ,బాలింత, గోపాలపురం

ముగిసిన టెన్త్ మెయిన్ పరీక్షలు

దేవరపల్లి: పదో తరగతి మెయిన్ పరీక్షలు ముగిశాయి. ఈ నెల 18న ప్రారంభమైన ఈ పరీక్షలు బుధవారం నాటి సోషల్ స్టడీస్ పరీక్షతో ముగిసినట్టు మండల విద్యాశాఖాధికారులు ఎం.తిరుమలదాస్, కేఆర్‌ఎస్‌వీవీ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న సంస్కృతం, 30న ఒకేషనల్ పరీక్షలు జరుగుతాయని తిరుమలదాస్ తెలిపారు. బుధవారం నాటి సోషల్ స్టడీస్ పరీక్షకు మండలంలో 54 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు తెలిపారు. మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో 982 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా, 928 మంది రాసినట్టు తెలిపారు. సప్లిమెంటరీ విద్యార్థులు 48 మందికి గాను 16 మంది (33.33 శాతం) హాజరైనట్టు చెప్పారు.

43 మంది విద్యార్థుల గైర్హాజర్

ఉండ్రాజవరం: పదో తరగతి పరీక్షలు మండలంలో ప్రశాంతంగా జరుగుతున్నట్టు మండల విద్యాశాఖాధికారి సీహెచ్ సక్సేనారాజు బుధవారం తెలిపారు. గురువారం సంస్కృతం, శనివారం ఒకేషనల్ పరీక్షలతో ఈ పరీక్షలు ముగుస్తాయని చెప్పారు. మండలంలోని ఐదు కేంద్రాల ద్వారా బుధవారం నాటి సోషల్ స్టడీస్ పరీక్షకు 1102 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 1059 మంది మాత్రమే హాజరైనట్టు తెలిపారు. 43 మంది విద్యార్థులు గైర్హాజర్ అయినట్టు వివరించారు.

చాగల్లు మండలంలో 53 మంది..

చాగల్లు: బుధవారం నిర్వహించిన పదో తరగతి సోషల్ స్టడీస్ పరీక్షకు చాగల్లు మండలంలో 53 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి వి.ఖాదర్‌బాబు తెలిపారు. మూడు కేంద్రాల్లో మొత్తం 443 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 390 మంది విద్యార్థులు మాత్రమే హాజరైనట్టు ఖాదర్‌బాబు తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసిందని చెప్పారు.

జగన్ బాటలో ప్రజలకు సేవ చేసేందుకే..



తాళ్లపూడిలోని సాయిస్ఫూర్తి హాస్పిటల్ సిబ్బందితో ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్

- రాజకీయాల్లోకి వచ్చాను
- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్

తాళ్లపూడి: పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు నిరంతరం తపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు ఆకర్షితుడినై, ప్రజలకు మరింత సేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. తాళ్లపూడిలోని సాయిస్ఫూర్తి ఆస్పత్రికి బుధవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆ ఆస్పత్రి సీఈఓ గూడా విజయరాజు, వైద్య సిబ్బంది ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌ను సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. ఆయన విజయానికి తామంతా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి జగన్ పాలన చాలా అవసరం ఉందన్నారు. పేదలకు మేలు చేస్తున్న ఆయనను ఓటించడానికి పెత్తందార్లు అందరూ ఏకమయ్యారన్నారు. వైద్య వృత్తిని వదిలి జగన్ కోసం వచ్చిన తనను, కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, ఆస్పత్రి యాజమాన్యం, తాడిపూడి, గజ్జరం సర్పంచులు నామా గోపాలం, గండి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా చిట్టిబాబు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాళ్ల బాబూరావు, నరాలశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ



చంద్రవరంలో కొత్తగా ప్రతిష్ఠించిన లక్ష్మీ గణపతి స్వామి

చాగల్లు: మండలంలోని చంద్రవరం గ్రామంలో బుధవారం లక్ష్మీ గణపతి స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠను గ్రామస్తులు వైభవంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించారు. యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన వంటి క్రతువులను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని, విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ప్రథమ కుంకుమ పూజ, పూర్ణాహుతి, అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి



కొవ్వూరు 20వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- కొవ్వూరు 20వ వార్డులో ఇంటింటి ప్రచారం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనకు రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ అండగా నిలవాలని ఆ పార్టీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. పట్టణంలోని 20వ వార్డులో బుధవారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే ప్రతి పేదవాడికీ మేలు చేకూరుతుందన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి వివరాలను తెలియజేసే కరపత్రాలను ఆయన ఇంటింటికీ పంచారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో 20వ వార్డు కౌన్సిలర్ పతివాడ నాగమణి, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, కౌన్సిలర్లు కంఠమణి రమేష్, దేవగుప్తాపు లక్ష్మణరావు, నాయకులు బావన రాజేష్ (బెన్ని), చొప్పా అప్పలనాయుడు, సూర్ల నరేష్, చిట్టూరి అన్నవరం, పిక్కి శ్రీనివాస్, గాడి విజయ్‌రాజ్‌కుమార్, గుర్రే శరత్, మరపట్ల శ్రీనివాస్, పరిమి సోమరాజు, ఎండీ ఆలీ, ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో జగన్ సుస్థిరం

గంగోలులో గడప గడపకూ వనితమ్మ



హుకుంపేటలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి తానేటి వనిత

గోపాలపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని గంగోలు పంచాయతీ పరిధిలోని గంగోలు, హుకుంపేట, రాంపాలెం గ్రామాల్లో బుధవారం ఆమె గడప గడపకూ వనితమ్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని వృద్ధులు, వికలాంగులతో మాట్లాడి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ప్రతి పక్షాలు ఏకమైనా ప్రజలు మాత్రం వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. జనం జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరిస్తుంటే విపక్షాల కుళ్లుకుంటున్నారని, అమలు కానీ హామీలిచ్చి ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పార్టీ జిల్లా నాయకులు ఎస్‌కె ఖాదర్ వల్లీ, మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, వైఎస్సార్ సీపీ గంగోలు, హుకుంపేట, రాంపాలెం నాయకులు పాల్గొన్నారు.

గోపాలపురం టికెట్ మాలలకు ఇవ్వాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న బొంతా రవిప్రకాష్

నల్లజర్ల: గోపాలపురం అసెంబ్లీ టీడీపీ టికెట్‌ను మాలలకు కేటాయించాలని ఆ పార్టీ అధిష్టానానికి మాల మహాసభ విజ్ఞప్తి చేసింది. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం సాయంత్రం మాలమహాసభ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బొంతా రవిప్రకాష్ మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా ఈ స్థానాన్ని మాదిగలకే కేటాయిస్తూ వచ్చారన్నారు. నియోజకవర్గంలో మాలల ఓట్లు 50 వేలు ఉన్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో 9.7 శాతం ఉన్న మాలలకు రాజ్యాంగం ద్వారా అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్లకు సమన్యాయం కల్పించాలని రవిప్రకాష్ కోరారు. కొవ్వూరు టీడీపీ అసెంబ్లీ టికెట్ మాదిగలకు కేటాయించినందున, గోపాలపురం స్థానాన్ని మాలలకు కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు గుదే వెంకట సుబ్బారావు, మాల మహాసభ జిల్లా అధ్యక్షుడు దొడ్డి వెంకటేశ్వర్లు, పిల్లి కాంతారావు, గుదే శ్రీనివాసరావు, గంజి కిరణ్, దాసరి బాలాజీ, జి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తాళ్లపూడి: స్థానిక మెయిన్ రోడ్‌లోని రాజకుమార్ సిల్క్స్ పక్కనే మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక న్యూ యువశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని బుధవారం తాళ్లపూడి ఎస్సై శ్యామ్ సుందర్ ప్రారంభించారు. సేవా కార్యక్రమాలు చేసున్న ఆటో యూనియన్‌ను, యూనియన్ అధ్యక్షుడు కడవుల రజనీకుమార్‌ను ఎస్సై అభినందించారు. రజనీకుమార్ మాట్లాడుతూ వారానికి ఒకసారి మజ్జిగ వంటి పానీయం, మిగతా రోజుల్లో స్వచ్ఛమైన చల్లటి తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యాళ్ల బాబురావు, ఆటో యూనియన్ సభ్యులు మంగరాజు, వీరబాబు, దాస్, ప్రతాప్, రాయుడు, ఏడుకొండలు, శ్రీను, మోషే తదితరులు పాల్గొన్నారు.

మేలు చేశాం.. ఆదరించండి

- ఎమ్మెల్యే తనయుడు వరుణ్‌సాయి
- గోపవరం గ్రామంలో ఇంటింటి ప్రచారం



గోపవరంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే తనయుడు వరుణ్ సాయి, పార్టీ నాయకులు

నిడదవోలు రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణంగా నెరవేర్చారని, వచ్చే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడి తనయుడు వరుణ్‌సాయి కోరారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా మండలంలోని గోపవరం గ్రామంలో వరుణ్ సాయి బుధవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. ప్రచారంలో ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, ఆ పార్టీ నాయకులు ఆరేపల్లి చంటి, దొడ్ల మురళి, తోలేటి శ్రీనివాస్, తాతపూడి నాగేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రోగికి 'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల: ప్రమాదంలో కాలు విరిగిపోయి, ఏడు నెలలుగా మంచంపై ఉండి చికిత్స పొందుతున్న మండలంలోని చోడవరం గ్రామస్తుడు కుడుముల కృష్ణకు మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ బుధవారం రూ.నాలుగు వేల ఆర్థిక సాయం చేసింది. ఈ కార్యక్రమంలో భోగవల్లి వెంకట సుబ్బారావు, ఐడీవీ అప్పారావు, మద్దు రామకృష్ణ, ఉండవల్లి నాగేశ్వరరావు, ఆలపాటి పెదరాము, సాయిబాబు పాల్గొన్నారు.

స్వామి వారి హుండీల ఆదాయం రూ.3.03 లక్షలు



అన్నవరప్పాడులో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామి వారి ఆలయ హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. ప్రధాన హుండీతో పాటు ఉపాలయాల హుండీలా ద్వారా 30 రోజులకు రూ.3.03 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీలను తెరిచి, లెక్కించామని, ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని ఆయన వివరించారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దల సహకారంతో ప్రతి శనివారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు. హుండీల ఆదాయం లెక్కింపు వేలివెన్ను గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి పీవీ సుబ్రహ్మణ్యం సమక్షంలో జరిగింది. అన్నవరప్పాడు గ్రామ పెద్దలు పంతం చిన్న, పంతం నాగేశ్వరరావు, యాళ్లబండి శ్రీనివాస్, కోటిపల్లి గంగన్న, ఓసూరి బాల నాగేశ్వరరావు, గుత్తుల మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా

- జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వసుంధర



వసతి గృహంలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వసుంధర

పెరవలి: హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికపుడు పర్యవేక్షణ ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎస్.వసుంధర అన్నారు. మండలంలోని కానూరు బాలికల వసతిగృహాన్ని బుధవారం ఆమె సందర్శించారు. హాస్టల్ రికార్డులను పరిశీలించిన ఆమె విద్యార్థినుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.వసుంధర మాట్లాడుతూ విద్యార్థినులకు రోజూ పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. రక్తహీనత ఉన్న విద్యార్థినులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థినులకు రోజూ భోజన సమయంలో మునగాకు కారంపొడి అందించాలన్నారు. ప్రతి రోజు ఇస్తున్నారా? లేదా? అంటూ అడిగారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాస్, హేమరాజు, జగదీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గేష్ పరిచయ భేటీలు

పెరవలి: జనసేన పార్టీ నిడదవోలు అసెంబ్లీ అభ్యర్థి కందుల దుర్గేష్ బుధవారం మండలంలోని కడింపాడు, మల్లేశ్వరం, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం గ్రామాల్లో పర్యటించారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులతో సమావేశమై, వారిని పరిచయం చేసుకున్నారు. టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.